తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, బీఆర్ఎస్ నేత వాసుదేవరెడ్డి

మీకు చేతకాకపోతే మాకివ్వండి

- మరమ్మతులు చేసి చూపిస్తం
- కాళేశ్వరంపై రేవంత్‌కు హరీశ్ సవాల్
- కాళేశ్వరమంటే మేడిగడ్డ ఒక్కటే కాదు భారీ రిజర్వాయర్లు, టన్నెళ్లు, పంప్‌హౌజ్‌ల సమాహారం
- బురద రాజకీయాలు మానండి
- రైతులకు నష్టం వాటిల్లకుండా చూడండి: హరీశ్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మేడిగడ్డ ఒక్కటే కాదని, ప్రాజెక్టు సమగ్ర స్వరూపం చాలా మందికి తెలియదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాళేశ్వరమంటే 3 బరాజ్‌లు, 15 రిజర్వాయర్లు, 19 సబ్‌స్టేషన్లు, 21 పంప్‌హౌజ్‌లు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1,531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్, 98 కిలోమీటర్ల ప్రెజర్‌మెయిన్స్, 141 టీఎంసీల స్టోరేజీ కెపాసిటీ, 530 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్, 240 టీఎంసీల ఉపయోగ సమాహారమని వివరించారు. అయినప్పటికీ ప్రాజెక్టుపై కాంగ్రెస్ లేనిపోని ఆరోపణలను చేస్తున్నదని, బురద రాజకీయాలకు పాల్పడుతున్నదని నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మంగళవారం మేడిగడ్డలో పర్యటించి చేసిన ఆరోపణల నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో బుధవారం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు, సీఎం ఆరోపణలను తిప్పికొట్టారు. 'సీఎంను రాజీనామా చేసి మాకు అధికారం అప్పగించమనండి. రిపేర్ చేసి చూపిస్తాం. మేం మేడిగడ్డను పునరుద్ధరించి నీళ్లు ఇచ్చి చూపిస్తాం' అని సవాల్ చేశారు. కాంగ్రెస్ నేతలకు సీఎం మేడిగడ్డనే కాకుండా మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, అన్నపూర్ణ, పంప్‌హౌజ్‌లు, కాలువలు వాటికింది పంట పొలాలనూ చూపించాల్సిందని అన్నారు. కాళేశ్వరం గురించి కాంగ్రెస్ ఎంత తక్కువ చేసి మాట్లాడినా అది ముమ్మాటికీ తెలంగాణకు వరదాయినేనని, తెలంగాణ ప్రజలకు జీవధార అని అభివర్ణించారు. లోయర్ మానేరు నుంచి సూర్యాపేట దాకా నిండిన చెరువులు, పండిన పంటలు, భూమిలో పెరిగిన ఊటలు, మోటర్లు లేకుండానే ఉబికివస్తున్న బోర్లు.. ఇవన్నీ కాళేశ్వరం ఫలాలేనని ఉదహరించారు. కూడవెల్లి వాగు పొంగిందన్నా, హల్దీవాగు దుంకిందన్నా, చెక్‌డ్యామ్‌లు పొంగిపొర్లాయన్నా, చెరువులు మత్తడి దుంకినా అది కాళేశ్వరం ప్రసాదించిన ఫలితమేనని,పెరిగిన పంటరాశుల్లో ప్రతిబింబించేది కాళేశ్వరమేనని తెలిపారు.

పునరుద్ధరణ చేపట్టండి.. నీళ్లను మళ్లించండి

రెండు పిల్లర్లు కుంగినందుకు తెలంగాణకు ప్రాణాధారమైన కాళేశ్వరం ప్రాజెక్టును అవమానిస్తున్నారని, ఆ సాకుతో ప్రాజెక్టును అలక్ష్యం చేస్తున్నారని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. రాజకీయ లబ్ధి కోసం మొత్తం ప్రాజెక్టునే డ్యామేజ్ చేయాలనే దుష్ట పన్నాగానికి పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. కుంగిన పిల్లర్లకు రిపేర్లు చేయించి పొలాలకు నీళ్లు మళ్లించాలని, పిల్లర్ల కుంగుబాటుపై విచారణ జరిపి బాధ్యులను నిరభ్యంతరంగా శిక్షించాలని శాసనసభ వేదికగా తామే డిమాండ్ చేశామని గుర్తుచేశారు. 1959లో కడెం వాగు ప్రాజెక్టు కట్టలు, గేట్లు కొట్టుకుపోయాయి. సింగూర్ డ్యాం, ఎల్లంపల్లి, సాత్నాల ప్రాజెక్టులు కూడా కొట్టుకుపోయాయి. పుట్టగండి ప్రాజెక్టు ప్రారంభించగానే కొట్టుకుపోయింది. కాంగ్రెస్ హయాంలోనే పంజాగుట్టలో ఫ్లైఓవర్ కూలి పలువురు చనిపోయారు. పొరుగు రాష్ట్రంలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. పులిచింతల డ్యామ్ గేట్లు ఇప్పటికీ కొట్టుకుపోయే ఉన్నాయి. పోలవరం డయాఫ్రం వాల్ దెబ్బతిన్నది. ప్రాజెక్టుల్లో ఇలాంటి ఘటనలు జరిగితే కారకులను శిక్షించి, పునరుద్ధరణ చేసి రైతులకు న్యాయం జరిగేలా చూస్తారు. కానీ కాంగ్రెస్ తరహాలో బురద రాజకీయాలు చేయరు. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కాళేశ్వరం స్టడీ టూర్‌కు వచ్చి మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ రిజర్వాయర్లను చూసి తెలంగాణ ఇరిగేషన్‌ను ప్రశంసించారు. కానీ స్థానిక కాంగ్రెస్ నేతలు రాజకీయ లబ్ధి కోసం నల్లగొండ సభ డైవర్షన్ టూర్ పెట్టుకున్నారు' అని విమర్శించారు.

స్థిరీకరణ ఆయకట్టు చెప్పరెందుకు?

ఇంజినీర్లు వాస్తవాలు చెప్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి దబాయించి మరీ అబద్ధాలు చెప్తున్నారని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. వాస్తవాలను దాచిపెడుతున్నారని మండిపడ్డారు. రూ.94 వేల కోట్లు ఖర్చు పెట్టినా కాళేశ్వరం ద్వారా రూ.98 వేల 570 కొత్త ఆయకట్టుకు మాత్రమే నీరందిస్తున్నారని సీఎం అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వాస్తవంగా కొత్త ఆయకట్టు అంతకంటే ఎక్కువే ఉంటుందని వెల్లడించారు. ఒక్క రంగనాయకసాగర్ ప్రాజెక్టు కింద 1.10 లక్షల ఎకరాలకు నీరందుతున్నట్టు ఇటీవల మంత్రి కొండా సురేఖనే స్వయంగా వెల్లడించారని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కెనాల్స్ ద్వారా 546 చెరువులు నింపి 39 వేల ఎకరాలకు, కాళేశ్వరం నీళ్లు ఎస్సారెస్పీ నీళ్లకు కలపడం ద్వారా 2,143 చెరువులు నింపి తద్వారా మరో లక్షా 67 వేల ఎకరాలకు నీళ్లు అందుతున్నాయని తెలిపారు. ఎస్సారెస్పీ స్టేజ్ 1, స్టేజ్2 ఆయకట్టుతోపాటు మొత్తంగా 17 లక్షల ఎకరాల స్థిరీకరణ జరిగిందని, రెండు పంటలకు నీళ్లు అందుతున్నాయని, మొత్తంగా 20 లక్షల 33,572 ఎకరాలకు నీళ్లు అందించామని హరీశ్‌రావు వెల్లడించారు. హల్దీ వాగు, కూడవెల్లి వాగు ద్వారా 20 వేల ఎకరాలకు నీళ్లు అందుతున్నాయని, ఇవేవీ ఇంజినీర్లు చెప్పకుండా రేవంత్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాస్తవాలు మరుగున పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి, డోర్నకల్, మహబూబాబాద్, ముస్తాబాద్, దుబ్బాక, మెదక్, గజ్వేల్ తదితర ప్రాంతాల రైతులను అడిగితే కాళేశ్వరం జలఫలాలను వివరిస్తారని అన్నారు.

తట్టమట్టి ఎత్తకుండా అంచనాలు పెంచారు

కాళేశ్వరం ప్రాజెక్టు అంచనాలను విపరీతంగా పెంచారని కాంగ్రెస్ నేతలు, సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలను హరీశ్‌రావు ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును రూ.17 వేల కోట్ల అంచనాతో 2007లో ప్రతిపాదించిందని, తట్టమట్టి ఎత్తకుండానే 2008లో దాని అంచనాలను రూ.38 వేల కోట్లకు పెంచిందని, కేంద్ర జల సంఘానికి నివేదించే నాటికి అది రూ.40 వేల కోట్లకు చేరిందని తెలిపారు. ప్రాజెక్టు అంచనా విలువ రూ.40 వేల కోట్లకు ఎందుకు, ఎలా పెరిగిందని నిలదీశారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో రిజర్వాయర్ల సామర్థ్యం 14 టీఎంసీలే ఉండగా, కాళేశ్వరంలో 141 టీఎంసీలని, కొత్త జలాశయాలు ప్రతిపాదించామని, చెరువులను అనుసంధానించటంతో అదనపు నిర్మాణాలు, భూసేకరణ, పునరావాసం కోసం అదనంగా ఖర్చు పెరుగుతుందని వివరించారు. ప్రభుత్వం వెంటనే టెక్నికల్ సమస్య తెలుసుకొని యుద్ధప్రతిపాదికన మేడిగడ్డ పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని, రైతులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, సంజయ్, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువలు తవ్వండి

ఏ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలోనైనా మొదట హెడ్‌వర్క్స్ అంటే డ్యామ్‌లు, బరాజ్‌లు, స్పిల్‌వే గేట్లు, జలాశయాలు.. ఎత్తిపోతల పథకాలైతే పంప్‌హౌస్‌లు, సర్జ్‌పూల్స్, విద్యుత్తు సబ్‌స్టేషన్లు, విద్యుత్తు లైన్లు, డెలివరీ సిస్టర్న్‌లు తదితర అనుబంధ నిర్మాణాలు పూర్తి చేస్తారని, వాటిపైనే ప్రభుత్వాలు నిధులు కేటాయించి ఖర్చు చేస్తాయని హరీశ్‌రావు వివరించారు. అవి నిర్మాణం కాకుండా ఆయకట్టుకు నీరివ్వలేమని, వాటి తర్వాతనే ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణంపై ఖర్చు చేస్తారని తెలిపారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ విషయంలో పనులు పూర్తి చేయకనే నీళ్లు ఇవ్వలేదని ఉదహరించారు. తాము అధికారంలోకి వచ్చాకనే అన్ని పూర్తిచేసి నీళ్లు అందించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ హయాంలో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల ద్వారా మొత్తంగా 27 వేల ఎకరాలకు మాత్రమే సాగునీళ్లు అందిస్తే, తాము పెండింగ్ పనులన్నీ పూర్తి చేసి 6,36,700 ఎకరాలకు నీళ్లు అందించామని తెలిపారు. తాము చేసినట్టుగానే కాంగ్రెస్ ప్రభుత్వం పనులు చేయాలని, కాళేశ్వరం కాల్వలు తవ్వి పూర్తి ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలని సూచించారు. లేదంటే ప్రజలకు, రైతులకు తాగు, సాగు నీళ్ల ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు.

కేసీఆర్‌పై కక్షతో..

రైతులను బలిపెట్టొద్దు

- పిల్లర్లు రిపేర్ చేసి నీళ్లు ఎత్తిపోయండి
- కాళేశ్వరం అంటే మేడిగడ్డ ఒక్కటే కాదు
- కాళేశ్వరం వల్లే ఎర్రటి ఎండల్లోనూ ఎల్ఎండీ, ఎంఎండీలో నీళ్లు
- శ్రీధర్‌బాబు, పొన్నంకు కూడా ఇది తెలుసు
- సభ్యులందరినీ స్పీకర్ ఒకేలా చూడాలి
- దళితనేత కడియంపై రాజగోపాల్ వ్యాఖ్యలు దారుణం
- శాసనసభలో మాజీ మంత్రి కేటీఆర్

శాసనసభలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ): కేసీఆర్‌పై కోపంతో రైతులపై కక్ష పెంచుకోవద్దని మాజీ మంత్రి కేటీఆర్ ప్రభుత్వాన్ని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని ఒక్క బరాజ్‌లో మూడునాలుగు పిల్లర్లకు ఇబ్బంది కలిగితే వాటిని రిపేర్ చేసి రైతులుకు సాగునీరు అందించాలని కోరారు. రాజకీయం కోసం కేసీఆర్‌పై కోపం పెంచుకున్నా రైతులపై మాత్రం కక్షగట్టొద్దని హితవు పలికారు. ప్రస్తుతం 5 వేల క్యూసెక్కుల నీళ్లు కిందికి పోతున్నాయని, మేడిగడ్డ నింపి కాళేశ్వరం పంపింగ్ మొదలుపెట్టాలని కోరారు. బుధవారం కేటీఆర్ శాసనసభలో మాట్లాడుతూ ప్రభుత్వానికి ఈ విజ్ఞప్తి చేశారు.

ఎల్ఎండీ, ఎంఎండీ, సింగూరు, ఎస్సారెస్పీ అన్నీ కాళేశ్వరం పుణ్యమే

కాళేశ్వరం ద్వారా కొత్తగా 97 వేల ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని కాంగ్రెస్ నేతలు అంటున్నారని, కానీ స్థిరీకరించిన ఆయకట్టు ఎంతని అడిగితే మాత్రం సమాధానం లేదని పేర్కొన్నారు. ఎర్రటి ఎండల్లోనూ అప్పర్ మానేరు, మిడ్‌మానేరు నీళ్లతో నిండిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌కు కూడా ఈ విషయం తెలుసని పేర్కొన్నారు. గౌరవెల్లి, మలక్‌పేట్ రిజర్వాయర్, అప్పర్ మానేరు, స్థిరీకరించబడిన సింగూరు, నిజాంసాగర్, ఎస్సారెస్పీ పునరుజ్జీవం అయినా ఇవన్నీ కాళేశ్వరం ద్వారా జరిగిన మాట వాస్తవమని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని ఇలాంటి వాస్తవాల గురించి ప్రజలకు చెప్పాలని కోరారు.

పొన్నం, నేను కలిసి పనిచేశాం

పొన్నం ప్రభాకర్ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని, ఆయన ఎంపీగా, తాను ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచి 2009 నుంచి కలిసి పని చేశామని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ కోసం వీరోచితంగా పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. మంత్రిని అవమానించే కుసంస్కారం తనకు లేదని తెలిపారు. కానీ, ఆయన వాస్తవ విరుద్ధ మాటలు చెప్తుంటే తట్టుకోలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం నియోజకవర్గం హుస్నాబాద్‌లో గౌరవెల్లి రిజర్వాయర్ పూర్తయ్యి ట్రయల్ రన్ అయిన విషయం నిజం కాదా? వేములవాడ నియోజకవర్గంలో మలక్‌పేట రిజర్వాయర్ మొత్తం పూర్తయ్యి అందులో ఒక టీఎంసీ నీళ్లు ఉన్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. మంత్రులు మేడిగడ్డకు వెళ్లి వచ్చి తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు దారుణం

కడియం శ్రీహరిపై కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకోవడంతో పాటు ఆ వ్యాఖ్యల్ని రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌ను కేటీఆర్ కోరారు. ఉప ముఖ్యమంత్రిగా, పదిహేనేండ్ల పాటు మంత్రిగా పనిచేసిన సీనియర్ దళిత రాజకీయ నాయకుడిపై ఆలాంటి వ్యాఖ్యలు దారుణమని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

సభ్యులందరినీ ఒకేలా చూడాలి

ప్రధాన ప్రతిపక్షంలో ఉన్న తమకు 39 మంది సభ్యులంటే అధికారపక్షంలో 64 మంది సభ్యులున్నారని కేటీఆర్ తెలిపారు. స్పీకర్ మాత్రం అధికార పక్షంలో ఎవరు లేచినా సమయం ఇస్తున్నారని, అధికారపక్ష సభ్యులు తమను వ్యక్తిగతంగా దూషించినా, నోటికొచ్చినట్టు మాట్లాడినా తమ వాదన వినిపించేందుకు స్పీకర్ సమయం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సభలోని 119 మంది సభ్యులకు సమాన అవకాశాలు ఉండాలని పేర్కొన్నారు. అధికారపక్ష సభ్యులు ఎప్పుడు అడిగినా, ఎంతసేపు అడిగినా మైక్ ఇస్తూ ప్రోత్సహించడం సరికాదని పేర్కొన్నారు. సభ్యులందరినీ ఒకేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

కాళేశ్వరం అంటే ఒక్కటే బరాజ్ కాదు

కాళేశ్వరం అంటే ఒకటే బరాజ్ కాదని, కాళేశ్వరం అంటే మూడు బరాజ్‌లు, 15 రిజర్వాయర్లు, 21 పంప్ హౌజ్‌లు, 19 సబ్‌స్టేషన్లు, 203 కిలోమీటర్ల టన్నెళ్లు, 1531 కిలోమీటర్ల గ్రావిటీ కాల్వలు, 141 టీఎంసీల స్టోరేజీ కెపాసిటీ, 240 టీఎంసీల యుటిలైజేషన్ అని కేటీఆర్ వివరించారు.

ఆత్మస్తుతి.. పరనింద

- ఆరు గ్యారెంటీల అమలుకు అడుగులు వేయని ప్రభుత్వం
- సీఎం ప్రజావాణిని వినడం లేదు.. ఢిల్లీవాణినే వింటున్నారు
- మండలిలో బడ్జెట్‌పై చర్చలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): ఆరు గ్యారెంటీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేయలేదని, బడ్జెట్‌లో మొత్తం ఆత్మస్తుతి, పరనిందలే ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం ప్రజావాణిని వినడం లేదు.. ఢిల్లీవాణినే వింటున్నారని విమర్శించారు. ప్రజావాణికి ఒక్కరోజే హాజరైన సీఎం వారానికి రెండుసార్లు ఢిల్లీకి పయనమవుతున్నారని ఎద్దేవా చేశారు. 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై బుధవారం శాసనమండలిలో జరిగిన చర్చలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడారు. కౌన్సిల్ ప్రతిష్టను, గౌరవ మర్యాదలను భంగపరిచేవిధంగా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రానున్న ఐదేండ్ల అభివృద్ధికి పునాది వేసే బడ్జెట్‌లో ప్రజలకు ఏమి చేస్తారో ప్రభుత్వం చెప్పలేకపోయిందని మండిపడ్డారు. గ్యారెంటీల్లో 10% అంశాలు కూడా బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవడం బాధాకరమని విమర్శించారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రకు తెలంగాణ బస్సును పంపించడాన్ని తప్పుబట్టారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఖర్చులకు తెలంగాణ ఏటీఎంగా మారిందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో ఒక్క నిమిషం కూడా కరెంటు పోలేదని, ఇప్పుడు హైదరాబాద్‌లోనే రోజుకు 3-4 గంటలు కరెంటు పోతుంటే పారిశ్రామికవేత్తలు పారిపోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రతిష్ట దిగజారిపోతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. గత రెండు నెలల్లో సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ముగ్గురు ఆడబిడ్డలు ఆత్మహత్య చేసుకుంటే స్పందించడానికి సీఎంకు తీరిక లేదా? అని ప్రశ్నించారు.

బడ్జెట్‌లో హామీలకు కేటాయింపులేవి?

బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలు అమలు చేయాలంటే దాదాపు రూ.1.36 కోట్లు అవసరమనే అంచనాలు ఉండగా, బడ్జెట్‌లో రూ.53 వేల కోట్లు మాత్రమే కేటాయించారని కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. మహాలక్ష్మి పథకం కింద 18 ఏండ్లు నిండిన 1.39 కోట్ల ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 ఇవ్వాలంటే రూ.49 వేల కోట్లు అవసరమవుతాయని, ఈ అంశాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించలేదని ఎండగట్టారు. కళ్యాణలక్ష్మి కింద రూ.లక్షతోపాటు తులం బంగారం హామీని ఎప్పుడు అమలుచేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల పేరిట ఉన్న కనెక్షన్లకే సబ్సిడీ ఇస్తారా? పురుషుల పేరిట ఉన్న కనెక్షన్లకు కూడా ఇస్తారా? అన్న అంశంపై స్పష్టత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దివ్యాంగులకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్‌కు నిధులు కేటాయించలేదని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఏటా కనీసం రూ.20 వేల కోట్లు అవసరం కాగా, రూ.7 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని దుయ్యబట్టారు. మైనారిటీ మంత్రి లేకుండా ప్రభుత్వం నడవడం ఇది చరిత్రలో తొలిసారి అని పేర్కొన్నారు. తక్షణమే మైనారిటీలకు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. కులగణన కోసం రూపాయి కూడా కేటాయించలేదని తెలిపారు. బీసీ సబ్‌ప్లాన్‌కు రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పిన ప్రభుత్వం రూ.8 వేల కోట్లు మాత్రమే కేటాయించారని మండిపడ్డారు. 2014-2023 వరకు తాము ఏం చేశామో చెప్తామని, 2004- 2014 వరకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని, అందుకు ప్రత్యేకంగా చర్చ పెట్టాలని సవాల్ చేశారు. ప్రభుత్వానికి 100 రోజుల సమయం ఇస్తున్నామని, ఆ తర్వాత తప్పులను ఎత్తిచూపిస్తామని స్పష్టం చేశారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డంగా దొరికిపోయిందని విమర్శించారు. రామగుండం మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ ఘటనపై మండలిలో చర్చించాలని మండలి చైర్మన్ గుత్తా కవిత లేఖ రాశారు.

తెలంగాణ తల్లికి బదులు.. రాజీవ్‌గాంధీ

- సచివాలయం ఎదురుగా విగ్రహ ఏర్పాటుకు నిర్ణయం
- ఏర్పాటు పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన
- కేసీఆర్ సర్కార్ నిర్ణయానికి తిలోదకాలు
- ఇది తెలంగాణ అస్తిత్వాన్ని అవమానించడమే
- నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్

తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు కోసం కేసీఆర్ ప్రభుత్వం రూపొందించిన డిజైన్

చెరగని ముద్ర చెరిపేసే కుట్ర

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): సచివాలయం ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు నిర్ణయించిన స్థలంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. తెలంగాణవాదులు, బీఆర్ఎస్ నేతలు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోకుండా.. విగ్రహం ఏర్పాటు పనులకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెలికం రంగంలో విప్లవాత్మక మార్పు తెచ్చిన మహానేత రాజీవ్ గాంధీ అని, దేశ సమగ్రత కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడని చెప్పారు. విగ్రహావిష్కరణకు సోనియాగాంధీని ఆహ్వానిస్తామని తెలిపారు.

సచివాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించాలని కేసీఆర్ ప్రభుత్వం భావించింది. 'సచివాలయంలో కొలువుదీరే ప్రభుత్వం అమరుల త్యాగాలను నిత్యం స్మరించుకునేలా అమరజ్యోతి ఓవైపు.. స్వరాష్ట్ర కలను సాకారం చేసిన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు నివాళిగా 125 అడుగుల మహా విగ్రహం మరోవైపు ఇప్పటికే ఏర్పాటయ్యాయి. సచివాలయం ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుతో తెలంగాణ అస్తిత్వ పతాక సమున్నతంగా ఎగురుతుంది' అనే భావనతో డిజైన్లు కూడా సిద్ధం చేయించింది. అయితే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పనులు ప్రారంభించలేదు. ఇప్పుడు ఆ స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుచేయాలన్న సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయంపై తెలంగాణవాదులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీసి, కేవలం రాజకీయ లబ్ధి కోసం రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికే ట్యాంక్‌బండ్ పరిసరాల్లో కాంగ్రెస్ నేతలైన ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, జైపాల్‌రెడ్డి విగ్రహాలు ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. వీటికి అదనంగా ఇప్పుడు రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం ఏమిటని మండిపడుతున్నారు. అమరులకు నివాళిగా నిర్మించిన అమరజ్యోతి ముందు రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అక్కడ తెలంగాణ తల్లి విగ్రహాన్ని మాత్రమే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికే తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖలు మారుస్తామని ప్రభుత్వం చెప్పిందని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడున్న నమూనాలోగానీ, కొత్త నమూనాలోగానీ తెలంగాణ తల్లి విగ్రహాన్ని మాత్రమే ఏర్పాటు చేయాలని స్పష్టం చేస్తున్నారు. లేదంటే పోరాటాలకు సైతం వెనుకాడమని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు.

తెలంగాణ ఆనవాళ్లు తుడిచేసేలా..

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఆనవాళ్లు తుడిచేసేలా ప్రవర్తిస్తున్నదని బీఆర్ఎస్ ప్రధానకార్యదర్శి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. సచివాలయం ఎదురుగా ఉన్న స్థలంలో గత ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టాలని నిర్ణయించి, ఈ మేరకు ప్లాన్ కూడా సిద్ధం చేసిందని తెలిపారు. ఈ లోపు ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారిందన్నారు. ఇప్పుడు ఆ ప్రదేశంలో రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. తెలంగాణ ఉద్యమ అస్థిత్వాన్ని మరుగుపరచే విధంగా, తెలంగాణ ఆనవాళ్లు తుడిచివేసేలా అనేక కార్యక్రమాలు చేస్తున్నదని మండిపడ్డారు. 'ఆంధ్ర వలస వాదుల, ప్రవాసాంధ్ర మేధావుల సలహాలతో తెలంగాణ తల్లిని కించపరుస్తూ, చరిత్ర కలిగిన కాకతీయులను, గోల్కొండ నవాబులను ఇప్పటికే కించపరుస్తూ మాట్లాడారు. వెంటనే రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటును విరమించుకోవాలని భారతరాష్ట్ర సమితి డిమాండ్ చేస్తున్నది' అని పేర్కొన్నారు.

గుండెపోటుతో మరో ఆటోడ్రైవర్ మృతి

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి14: గుండెపోటుతో ఆటోడ్రైవర్ మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామానికి చెందిన బండెల్ల శివకుమార్(39) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకొంటున్నాడు. ఇటీవల ప్రభుత్వం మహాలక్ష్మీ పథకం ప్రవేశపెట్టడంతో ఆటోలో జనాలు ఎక్కడం లేదని, ఫైనాన్స్ ఎలా కట్టాలని మానసికంగా ఆవేదన చెందగా, అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. దవాఖానలో చికిత్స పొంది మంగళవారం ఇంటికొచ్చాడు. బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య పూర్ణమ్మ, కుమారుడు అక్షిత్ (12), కూతురు దీక్షిత (10) ఉన్నారు. శివకుమార్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ జ్యోతీప్రభాకర్ కోరారు.

రేపు ఆటో బంద్

- హైదరాబాద్‌లో భారీ ఆటో ర్యాలీ
- విజయవంతం చేయాలి
- ప్రభుత్వం స్పందించకపోతే తగిన బుద్ధి చెబుతాం
- టీఏటీయూ నాయకుడు వేముల మారయ్య హెచ్చరిక

బంద్ విజయవంతం కోరుతూ